క్లుప్తంగా

విజయరాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: పెదపులిపాక కలోని శ్రీ విజయరాజ రాజేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారికి జేష్ఠ పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం జరిగింది. ప్రత్యేక అలంకరణలో కంకుమార్చన చేశారు. వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఆదివారం దాత రూ.50 వేలు విరాళంగా అందజేశారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్, భార్య రాజకుమారి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణవేణి, ఆకుల సుశీల, ఝాన్సీ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వారిపై వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరుకు చెందిన పైడిముక్కల ఉజ్వల, డెంటల్ డాక్టర్ వణుకూరు ప్రవీణ్.. 2019లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రవీణ్ గోసాల సెంటర్‌లో ప్రాక్టీస్ చేస్తున్నాడు. గుంటూరులో నివసిస్తున్న ప్రవీణ్ మేనమామలు జి.వేణుప్రకాష్, రాజశేఖర్ ఇంట్లో ఉజ్వలను ఉంచి అక్కడ కాపురం పెట్టారు. అయితే పెళ్లి తర్వాత ప్రవీణ్ అప్పుడప్పుడు ఉజ్వల వద్దకు వచ్చేవాడు. కొంతకాలంగా ప్రవీణ్ తల్లి విజయశ్రీ వరకట్నం కింద రూ. కోటి తీసుకురావాలని ఉజ్వలను వేధిస్తున్నారు. అత్తతోపాటు భర్త ప్రవీణ్, బంధువులు కూడా వరకట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ల్యాప్‌టాప్ చోరీ

పెనమలూరు: కానూరులో ల్యాప్‌టాప్ చోరీ ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన బొలుసు మహేంద్ర శ్రీనివాస్‌జగన్ హైదరాబాద్‌లో టీసీఎస్ సిస్టం ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. అతను అమెరికాలో ఎంఎస్ చేయడానికి విజయవాడ బెంజిసర్కిల్ వద్ద ఉన్న ఒక కన్సల్టెంట్ వద్ద ఇంటర్వ్యూ కోసం కొన్ని రోజుల క్రితం వచ్చాడు. కానూరులో ఇంజినీరింగ్ విద్యార్థి కౌశిక్ రూమ్‌లో ఉంటూ ఇంటర్వ్యూకు వెళ్లసాగాడు. ఈ నెల 1వ తేదీన ఉదయం విజయవాడలో ఇంటర్వ్యూకు వెళ్లి తిరిగి రూమ్‌కు వచ్చాడు. తాళాలు తెరిచి ఉంచిన రూమ్‌లో ల్యాప్‌టాప్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనికోసం స్థానికంగా వెదికినా దొరకలేదు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

భార్య, కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

కంకిపాడు: భార్య, చిన్న కుమార్తె కనిపించటం లేదంటూ ఓ వ్యక్తి కంకిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన నమ్మి మోహనకృష్ణ, సాయి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. కానూరులోని బట్టల దుకాణంలో మోహనకృష్ణ పని చేస్తుంటాడు. ఈ నెల 3వతేదీ మోహనకృష్ణ డ్యూటీకి వెళ్లాక తన చిన్న కుమార్తె నిహారిక (17 నెలలు)కు పంచాయతీ కార్యాలయంలో టీకా వేయిస్తానని తీసుకెళ్లిన భార్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెదికినా ఫలితం లేదు. భర్త మోహనకృష్ణ.. భార్య సాయి, చిన్న కూతురు నిహారిక కనిపించటం లేదని పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.





ఎండలు మండిపోతున్నాయ్

సూర్య ప్రతాపానికి జనం అల్లాడుతున్నారు. రోహిణీకార్తె, ఎండతోపాటు వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు మండలాల్లో ఉదయం 6 గంటల నుంచే సూర్యుడు సెగలు కక్కుతున్నాడు. రాత్రి 7 వరకూ వేడి గాలులు, ఆవిర్లు రావటంతో ఉక్కపోత పిన్న, పెద్ద తల్లడిల్లిపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు బయటకు రాలేని పరిస్థితి. వేడి నుంచి ఉపశమనానికి ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఎండ కారణంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకూ రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. పగటి వేళ వ్యాపారాలు ఉండకపోవటంతో పలువురు దుకాణదారులు షాపులు మూసివేస్తున్నారు.

–ఉయ్యూరు

జగనన్న కాలనీలో బోర్‌వెల్ పనులు ప్రారంభం

కేసరపల్లి(గన్నవరం): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి జగనన్న కాలనీల్లో 18, 19 లే అవుట్‌లో బోర్‌వెల్ ఏర్పాటు పనులను ఆదివారం ఎంపీపీతో పాటు సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 27 వేల పేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు దక్కుతుందన్నారు. ముఖ్యంగా కేసరపల్లి కాలనీలో సుమారు 2,700 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. వీరందరూ గృహ నిర్మాణాలు చేసుకునేందుకు వీలుగా ఇప్పటికే అంతర్గత రోడ్ల నిర్మాణం, విద్యుత్ లైన్లు ఏర్పాటు పనులు పూర్తిచేసినట్లు చెప్పారు. తాగునీటి సరఫరా నిమిత్తం ఇక్కడ మండల పరిషత్ నిధులు ద్వారా మూడు బోర్‌వెల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందుబాటులోకి వస్తున్న సదుపాయాలను దృష్టిలో పెట్టుకుని గృహ నిర్మాణాలు చేసేందుకు లబ్ధిదారులు ముందుకురావాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీకాకుళం సత్యనారాయణ(సాయి) పాల్గొన్నారు.



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు..



ఆత్మీయ సమ్మేళనంలో కలసిన 25 ఏళ్ల నాటి 1997 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు

ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న 1997, 2002 బ్యాచ్‌ల విద్యార్థులు

గన్నవరం రూరల్: పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలల చారిత్రక సంపద అని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎంవీ సుబ్బారావు అన్నారు. ఆదివారం ఒకే రోజు ఇదే పాఠశాలలో చదివిన 10వ తరగతి రెండు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు వేర్వేరుగా పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పాఠశాల ఆవరణ సందడి సంతరించుకుంది. 1997లో ఎస్ఎస్‌సీ చదివిన విద్యార్థులు 25సంవత్సరాల తర్వాత సిల్వర్ జూబ్లీ బ్యాచ్‌గా కలిశారు. అందరూ ఒక్కటై తమ ఆత్మీయతను పంచుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. 2002లో ఎస్ఎస్‌సీ పూర్తి చేసిన బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయంగా కలసి సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. వారితో పాటు చదువుకుని.. మరణించిన ఆత్మీయ స్నేహితులకు నివాళులర్పించి ఆ కుటుంబాలకు అండగా ఉందామని తీర్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులే పాఠశాలకు ఆస్తి అని చెప్పారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను వేదికలపైకి చేర్చి వారిని సన్మానించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పర్యావరణ శాఖ అధిపతి బ్రహ్మాజీరావు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక, ఆవారా, విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మాజీరావు మాట్లాడుతూ 1972లో ప్రారంభించిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నేటికి 50 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు పర్యావరణంపై ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

ప్లాస్టిక్ రహిత సంవత్సరం

ప్రతి సంవత్సరం ఒక థీమ్‌ను పర్యావరణ పరిరక్షణ కోసం ప్రారంభిస్తారని, ఈ సంవత్సరం ప్లాస్టిక్ రహిత సంవత్సరంగా ముందుకు తెచ్చారన్నారు. ప్లాస్టిక్ డీ కంపోజ్ కావడానికి 400 సంవత్సరాలు పైనే పడుతుందని, దీనిని నిర్మూలించకపోతే జీవ వైవిద్యానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని వ్యతిరేకించాలని చెప్పారు మనమే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి తద్వారా భూమి, పర్యావరణాన్ని కాపాడుకుంటామన్నారు. ఎఫ్‌ట్రానిక్స్ అధినేత రామకృష్ణ మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి గ్లోబల్ వార్మింగ్‌పై పెద్ద పోరాటం జరుగుతుందన్నారు. మనతోపాటు చిన్న సంచిని తీసుకెళ్లగలిగితే ప్లాస్టిక్‌ను ఎవరికి వారు నియంత్రించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆవారా వ్యవస్థాపకుడు అజయ్ కాట్రగడ్డ, ఇన్నర్ వీల్ క్లబ్ బాధ్యుడు కవిత, జన విజ్ఞాన వేదిక నాయకుడు శ్రీనివాస్, ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు యు.వి.రామరాజు, ఐజాక్ న్యూటన్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బ్రహ్మాజీరావు

ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రతిభ చూపాలి

కంకిపాడు: ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకుని ప్రతిభ చాటాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. వేసవి శిక్షణ తరగతులు మండలంలోని తెన్నేరు, కంకిపాడు శాఖా గ్రంథాలయంలో ఉత్సాహంగా సాగాయి. శిబిరంలో భాగంగా తెన్నేరు గ్రంథాలయంలో ఆట పాటలు, స్పోకెన్ ఇంగ్లిష్, గణితంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాలను సునీత పర్యవేక్షించారు. కంకిపాడు గ్రంథాలయంలో వేసవి శిబిరాలను గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

కొనసాగుతున్న వేసవి శిబిరాలు

గన్నవరం రూరల్: విద్యార్థులకు చిన్న నాటి నుంచి లెక్కలపై ఇష్టాన్ని పెంచాలని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో ఈజీ మ్యాథమెటిక్స్ సూత్రాలు విద్యార్థులకు వివరించారు. ముస్తాబాద శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. విజేతలను ఎంపిక చేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కళావేదికపై పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషం ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన హనుమాన్ నృత్య కళానిలయానికి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరగగా, భక్తులు ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వలంటీర్‌కు అభినందన



గన్నవరం రూరల్: దూర ప్రాంతానికి వెళ్లి పెన్షన్ అందజేసిన వలంటీర్ సేవలను ఆదివారం పలువురు ప్రశంసించారు. తెంపల్లి సచివాలయం పరిధిలోని బల్లిపర్రు గ్రామానికి చెందిన నిమ్మకూరి సుశీల కాటూరులో కంటికి ఆపరేషన్ చేయించుకొని అక్కడే బంధువుల ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ నెల పెన్షన్ ఆమెకు అందాల్సి ఉంది. విషయం తెలిసిన వలంటీర్ లోయ భూపతిరాజు కాటూరు వెళ్లి ఆమెకు పెన్షన్ అందజేశారు. వలంటీర్ సేవలను, ప్రభుత్వం ఎంతో శ్రద్ధతో లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయిస్తున్న విధానానికి సుశీల, కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్ భూపతి రాజును సర్పంచ్ కొలుసు శిరీష, పంచాయతీ కార్యదర్శి నామేశ్వరరావు, సచివాలయం కార్యదర్శి హర్షవర్ధిని అభినందించారు.

బహుముఖ ప్రతిభాశాలి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



విజయవాడకల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ లక్ష్మీశ ఐఏఎస్ అన్నారు. శృతిలయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం సీనియర్ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరిని నిర్వహించారు. లక్ష్మీశ మాట్లాడుతూ.. బాల సుబ్రహ్మణ్యం తెలుగుతో పాటు ఇతర భాషల్లో 50 వేలకు పైగా పాటలు పాడారన్నారు. విశ్రాంత వాణిజ్యపన్నుల శాఖ అధికారి ఆకురాతి కోదండ రామయ్య మాట్లాడుతూ.. సినీ నిర్మాతగా సంగీత దర్శకుడు బాలు తెలుగు సినిమా చరిత్రలో విజయయాత్ర చేశారన్నారు. లక్ష్మీశ ఇతర గాయనీ గాయకులతో కలిసి పలు చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, కేవీ బ్రహ్మానందరావు, మోదుమూడి సుధాకర్, పోపూరి గౌరీనాథ్ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. గాయకుడు కోదండరామయ్య, శివలీల బాలు ఆలపించిన గీతాలను ఆలపించారు.

కొండలమ్మ ఆలయంలో చండీ హోమం

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో చండీ హోమాన్ని చేపట్టారు. ఆదివారం ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి భక్తుల సర్వ శ్రేయస్సు, ఆయురారోగ్యా ఐశ్వర్య అభివృద్ధికి ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుడివాడ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, కమిటీ ధర్మకర్తలు, ఆలయ అర్చకుడు శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరానికి కిలో వెండి విరాళం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయి బాబా మందిరంలో వెండి తాపడం పనులకు ఆదివారం దాత కడియాల దీక్షిత తల్లిదండ్రులు సురేష్ దంపతులు కిలో వెండిని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రా షిర్డీగా విరాజిల్లుతున్న బాబా మందిరంలో తాము తలపెట్టిన వెండితాపడం పనుల్లో భక్తులను భాగస్వాములను చేసేందుకు వెండిని స్వీకరిస్తున్నామన్నారు. కొత్త వెండితో పాటు ఇంట్లో వాడని పాత వెండిని సైతం తాము వెండి తాపడం పనులకు తీసుకుంటున్నామన్నారు. దాత కడియాల దీక్షిత తండ్రి సురేష్ దంపతులు మాట్లాడుతూ మందిరంలో జరుగుతున్న వెండి తాపడం పనుల్లో తాము కూడా భాగస్వామి కావటం ఆనందంగా ఉందన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం

కంకిపాడు: గ్రామీణలకు మెరుగైన వైద్యం అందించాలని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) అన్నారు. కంకిపాడుకు చెందిన లైఫ్‌కేర్ ఆసుపత్రి సౌజన్యంతో కోలవెన్ను పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ పి.మునిరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని తుమ్మల చంద్రశేఖర్ ప్రారంభించారు. ఆసుపత్రి వైద్యులు శిబిరంలో 230 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. తుమ్మల చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు కూడా సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు. లైఫ్‌కేర్ ఆసుపత్రి వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించటం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైద్య సేవలను ప్రజల ముంగిటకు తెచ్చిందని వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్ (బుడ్డి)

ఏరువాక పౌర్ణమి పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని రైతన్నలు సంప్రదాయబద్ధంగా పుడమితల్లికి పూజా కార్యక్రమాలను నిర్వహించి వ్యవసాయ పనులను ఆదివారం ప్రారంభించారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో రైతాంగం తమ పొలాల్లో ఏరువాక పౌర్ణమి నిర్వహించారు. పెరికీడుకు చెందిన రైతు నాయకుడు నండూరు సత్య వెంకటేశ్వర శర్మ వ్యవసాయ క్షేత్రంలోనూ ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రోటోవేటర్‌తో నండూరు సత్య వెంకటేశ్వర శర్మ పొలం దున్ని వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. వర్షాలు పుష్కలంగా కురిసి, పంటలు బాగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

సమరసత ఆధ్వర్యంలో..

సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థానాల్లో విశేష పూజలు నిర్వహించారు. కొయ్యూరులోని శివాలయం, కాకులపాడు, బండారుగూడెం, వీరవల్లి సగర పేటలోని రామాలయాల్లో అధిక సంఖ్యలో మహిళలు సామూహిక హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరవల్లి సగర పేట రామాలయంలో హరేరామ, హరేకృష్ణ భజన నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు, సభ్యుడు ఎదురువాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించే ఉద్యోగులకు గుర్తింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించే ఉద్యోగులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని పలువురు కొనియాడారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌లో క్రెడిట్ మేనేజర్‌గా పని చేస్తున్న ఎం.సావిత్రి హైదరాబాద్ జోనల్ కార్యాలయానికి బదిలీ కావటంతో ఆదివారం బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఆమెను ఘనంగా సత్కరించారు. రెండున్నర ఏళ్లుగా ఇక్కడి ఖాతాదారులతో ఆమెకు ఉన్న సత్సంబంధాలను ఆమె గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో సహకరించిన తోటి ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ బొడ్డేపల్లి నరేష్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు వేగిరెడ్డి బాలాజీ పాల్గొన్నారు.



సావిత్రిని సత్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు

నేత్రపర్వంగా వెంకన్నకు గరుడసేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారు ఆదివారం గరుడ వాహనంపై ఊరేగారు. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న పురాతన ఆలయం శ్రీ వేంకటేశ్వస్వామి వారి దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవంలో భాగంగా విష్వక్సేనపూజతో ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞోపవీతధారణ, కన్యాదానం, మాంగల్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను పొన్నంగిపల్లి రామచంద్రమూర్తి, దీక్షితులు నిర్వహించారు.

విశేష హారతులు..

స్వామి వారి సన్నిధిలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం స్వామి వారికి గరుడ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి వారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం స్వామి వారికి సహస్రనామార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామి వారి ప్రత్యేక హారతులిచ్చి ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో ముమ్మార్లు ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, వేదపఠనం, భక్తుల నామస్మరణల మధ్య స్వామి వారి గరుడ సేవ వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.



స్వామి వారి గరుడ వాహన సేవ

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం స్వామి వారి ఆలయం నుంచి పలువురు భక్తులు ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి పవిత్ర కృష్ణాజలాలను కలశాలతో తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపల్లి అప్పారావు, బెవర సూర్యనారాయణ, మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

విశేష పూజలు

దేవస్థాన ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు మంగళ స్నానాలు జరిపించారు. తొలుత పంచామృత అభిషేకాలు, మంగళస్నానాలు అనంతరం స్వామి వారిని పెండ్లికుమారుడిగా అలంకరించారు. సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. తొలి రోజున ఉత్సవాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగా, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, పొట్నూరి దుర్గాప్రసాద్, ఈది ఎల్లారావు, తమ్మిన సూర్యకుమారి, కామందుల నరసింహరావు పాల్గొన్నారు.